విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 09, ఏప్రిల్ 2024

వాలంటీర్ల రాజీనామా వ్యక్తి గతమా.. రాజకీయ కోణమా?

విశాలాంధ్ర-వెలుగోడు: మండలంలోని 34 మంది వాలంటీర్లు రాజీనామా చేసిన సంఘటన వెనుక వ్యక్తిగత కారణమా, రాజకీయ కోణమా? అనేది మండలంలో చర్చనీయాంశంగా మారింది. వైసీపీ అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏవో ఉమర్‌కు రాజీనామా పత్రాలు వాలంటీర్లు అందజేశారు. రాజీనామా పత్రాల్లో వ్యక్తిగత కారణంగా అని పేర్కొన్నారు.వ్యక్తిగత కారణం అయితే మరి వైసీపీ నాయకులు గ్రూప్ ఫోటోలో ఎందుకు ఉన్నట్లు, ఈరాజీనామాల వెనుక రాజకీయ కోణం ఉండవచ్చని పలువురు చర్చించు కుంటున్నారు.వాలంటర్లలో ఒకరు ఎమ్మెల్యే కార్యక్రమాలకు మొదటి నుంచి సోషల్‌మీడియా ప్రతినిధిగా పనిచేశారు.కొందరు వైసీపీ నాయకుల కుటుంబానికి చెందినవారు, వారిబంధువుల కుటుంబ సభ్యులుగా ఉన్నారని సమాచారం.

దేవనగర్‌లో యువకుడు దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణమా? - పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

విశాలాంధ్ర-నంద్యాల: స్థానిక దేవనగర్‌లో సమీర్ (25) అనే యువకుడు మెడపై నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి దారుణ హత్య చేశారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు అతన్ని నిద్ర లేపడానికి వెళ్లితే విగత జీవిగా ఉన్న అతన్ని చూసి లబోదిబో మంటూ విలపించారు. వెంటనే మూడవ పట్టణ పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటన స్థలానికి చేసుకోని మృతదేహాన్ని పరిశీలించారు. అయితే హత్య జరగడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడు హత్యకు దారి తీసిన పరిస్థితులు, ఇదీ వ్యక్తిగత కారణాల లేక వివాహేతర సంబంధమా తదితర కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.

ప్రచారంలో దూసుకు వెళ్తున్న వైసీపీ

విశాలాంధ్ర-నందికొట్కూరు: నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలలో ఎన్నికల ప్రచారంలో వైసీపీ దూసుకు వెళ్లడం జరుగుతుంది. సోమవారం నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కోట వీధి 18,19వ వార్డు నందు గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈప్రచార కార్యక్రమానికి ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దార సుధీర్, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలకు మద్దతుగా గడప గడపకెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదప్రజలు బాగుండాలంటే తిరిగి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలను ఆర్థికం గా అందుకున్న ఏకైక సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్ళీ జగనన్ననే గెలిపించుకోవాలని.ప్రతిపక్షాలు ఎన్.డి.యే కూటమిగా ఏర్పడి జగనన్న పై యుద్ధం చేస్తున్నారన్నారు.మీ ఓటే ఆయుధంగా ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైసీపీ యువ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి,ఎంపీపీ మురళి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు మన్సూర్, సోమశేఖర్‌రెడ్డి, గుర్రాలభాస్కర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, సతీష్ కుమార్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు చింతా విజ్జి, ఉపేంద్రరెడ్డి, జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ ఉస్మాన్ బేగ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ సుకుర్ మియ్య, మండల అధ్యక్షులు రవియాదవ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జబ్బార్, బంగ్లా జడ్పీటీసీ పోచ జగదీశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపఎన్నికల్లో ఆటోనగర్ వాసుల సత్తా చూపించాం

విశాలాంధ్ర - నంద్యాల :ఉపఎన్నికల్లో ఆటోనగర్ వాసుల సత్తా చూపించామని, మూడుసార్లు శిల్పా కుటుంబాన్ని గెలిపించినా ఒక్క రోడ్డు కూడా వేయలేదని, ఆటో నగర్ లో రోడ్లు, కాల్వలు, మంచి నీళ్ళు అడిగినా ఒక్క పని చేయలేదని ఆటోనగర్ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఒక్క కాల్వ తప్ప ఆటో నగర్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నాడు ఎన్ఎండి ఫరూక్‌ను భారీ మెజారిటీతో గెలిపించి మా ఆటోనగర్ వాసుల సత్తా మరోసారి నిరూపిస్తామన్నారు. నాడు టీడీపీ హయాంలో రూ.50 లక్షలు ఇచ్చారని, ఉప ఎన్నికల్లో ఆటోనగర్ వాసుల స్థలాలకు రిజిస్ట్రేషన్‌లు జరిగాయన్నారు. మాజీ చైర్మెన్ డాక్టర్ ఎస్ఎండి నౌమాన్, ఆర్యవైశ్యులు వాసు, స్వతంత్ర కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌లాల్‌లను బైరెడ్డి రాజశేఖరరెడ్డి, ఎన్ఎండి ఫరూక్‌లు టిడిపి కి మద్దతు ఇవ్వాలని కోరారు.

సంక్షేమానికి మారు పేరు అన్న సీనియర్ ఎన్టీఆర్

విశాలాంధ్ర-బనగానపల్లె: సంక్షేమానికి మారు పేరు అన్న సీనియర్ ఎన్టీఆర్ అని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని పార్టీకి సంపద సృష్టించడం తెలుసు అలా పెరిగిన ఆదా యాన్ని ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేయడానికి టీడీపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు టీడీపీ పెట్టింది పేరు, సంక్షేమానికి అన్న సీనియర్ ఎన్టీఆర్ బ్రాండ్ అంబాసిడర్ పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3వేల నిరుద్యోగభృతి అందిస్తామన్నారు. యువతకు మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాము భరోసా ఇచ్చారు.సూపర్‌సిక్స్ పథకాల అమలు, నిత్యవసర ధరలు పెరగడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందరికీ టీడీపీ ప్రభుత్వంతో సముచిత న్యాయం జరుగుతుందని బీసీ వెల్లడించారు.

వైసీపీతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యం-ఎమ్మెల్యే గంగుల

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : వైసీపీతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమ వారం శిరివెళ్లకు చెందిన పలువురు టీడీపీని వీడి వైసీపీలో చేరారు. శిరివెళ్ల మండల నాయకులు, జిల్లా వైసీపీ ఉపాధ్యక్షులు బసాపురం అబ్దుల్‌సలాంల ఆధ్వర్యంలో శిరివెళ్ల ఎస్సీ కాలనీకి చెందిన పురుగుల జోజి, పుట్టుపల్లె ప్రదీప్, ప్రశాంత్, బాలయ్య, జోసెఫ్, కొల్లి సురేష్‌తో పాటు 20 కుటుంబాలు వైసీపీలో చేరారు.ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వీరందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శిరివెళ్ల నాయకులు చంద్ర ఉన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకోరాదు

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్ : వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని హెూటల్స్, మెకానిక్ దుకాణాల్లో పనిచేస్తున్న బాలా కార్మికులను గుర్తించి వారిని వెట్టి చాకిరి నుంచి విముక్తి చేసి, వారు చదువుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఐసిడిఎస్, లేబర్ ఆఫీసు, పోలీసు, న్యాయవాదులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, హెూటల్స్ మెకానిక్ కిరాణం దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు బలరాం నాయక్, లేబర్ అధికారి, ఐసిడిఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశమివ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా..!

విశాలాంధ్ర- మిడుతూరు : ఒక అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ధారా సుధీర్ ప్రజలను కోరారు. సోమవారం వై.దేవనూరు,సున్నంపల్లి గ్రామాల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డా. దార సుధీర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటి ఇంటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచు హరిత, ఎంపీటీసీ పరిదా, చిన్న అయ్యన్న, కో-ఆప్షన్ పెద్దమౌలా, పీరు సాహెబ్ పేట సొసైటీ చైర్మన్ తమిదల నాగ తులసిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి,మండల కన్వీనర్ తువ్వాలోకేశ్వరరెడ్డి, వైసీపీ జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ రాముడు, సర్పంచ్‌లు పణిభూషన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గుల్జార్, ఎమ్మెల్యే అభ్యర్థి డా. దారసుధీర్ సమక్షంలో పార్టీలో చేరారు.

పట్టణ ప్రజల దాహార్తి తీర్చండి-సీపీఐ

విశాలాంధ్ర-నందికొట్కూరు: స్థానిక సాయిబాబా పేట మరియు హాజీ నగర్ లోని కాలనీవాసులకు నీటి కొరత ఉందని కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నరని ప్రజల దాహార్తి కోసం చర్యలు చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు,జిల్లా నాయకులు రఘురాం మూర్తి ,పాములపాడు సిపిఐ మండల కార్యదర్శి ప్రసాద్‌లు కోరారు.సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ సుధాకరరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయిబాబా పేట బసిరెడ్డి జూనియర్ కళాశాల వెనుక వైపున్న పురపాలక సంఘం పరిధిలోని జి.యల్.యస్.ఆర్ ట్యాంకు ఇక్కడి కాలనివాసులకు ,హాజీనగర్ కాలనీ వాసులకు 2వ ఊట లాగా సంతోషంగా వుందనీ అయితే ట్యాంకుకు వాటర్ సప్లై చేసే పైపుకు కొంతమంది అక్రమంగా పైపులు తగిలించి గంటకు ఒకరు చొప్పున వారి ఇళ్లకు నీటిని మోటార్ల ద్వారా సరఫరా చేసుకుంటున్నారని, దీనివల్ల మిగతా కుటుంబాలకు నీరు అందక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. రోజురోజుకు కాలనీవాసుల మధ్య నీటి తగాదాలు జరుగుతున్నాయని తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి సాయిబాబాపేట హాజీ నగర్ కాలనీవాసులకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

వేసవి తాపానికి తట్టుకోలేని మూగజీవాలు

విశాలాంధ్ర-చాగలమర్రి: ఈనెల మొదటి వారంలో44డిగ్రీల ఎండవేడి ఉండటంతో చాగలమర్రి రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని దక్కించుకోవడం గమనార్హం. ఎండ తీవ్రతతోబోర్లు,బావులుఇతరనీటి ట్యాంకులలో జలాలు అడుగంటి పోవడంతో నీరు లేక మూగజీవాలుసైతం ప్రజల అవసరాల నిమిత్తం నిల్వ ఉంచిన నీటి వనరుల దగ్గరికి దాహార్తి తీర్చుకునేందు కు వస్తున్నాయి. ఇందుకు నిదర్శనం మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఓమంచి నీటిట్యాంకు వద్ద ఓఆవు కొళాయిని తనే తన నోటితో తిప్పుకొని దాహార్తిని తీర్చుకుంటున్నాయి. అలాగే పెద్ద భోదనం లోని ప్రధాన రహదారి వద్ద డైరెక్ట్‌గా నీరు విడుదల చేస్తున్నాడంతో కాకులు దాహార్తిని తీర్చుకోవడం కోసం వంపు పైన నిలబడి చుక్క చుక్క నీరు తాగడం జరుగుతుంది. మే మాసంలో తీవ్రత ఇంకా ఎంత ఉంటుందో అర్థం కాక ప్రజలు భయాందోళన గురవుతున్నారు. మూగజీవాల పరిస్థితి అర్థం కావడంలేదు. గొర్రెల కాపరులైతే నీరు నిలవలేక గ్రామాల్లోకి వచ్చి మంచినీటి బోర్ల వద్ద గొర్రెలకు నీళ్లు తాపుకొను చున్నారు. దేవుడు కరుణించి వర్షం కురిపించక పోతే పరిస్థితి ఆందోళనకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

నంది వాహన సేవ-మహా సరస్వతి అలంకారం

విశాలాంధ్ర-శ్రీశైలం: శ్రీశైలం మహా క్షేత్రంలో ఉగాది మహెూత్సవం లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామిఅమ్మవార్లకు ప్రభోత్సవం అనంతరం స్వామి అమ్మ వాళ్లకు నందివాహన సేవ మహా సరస్వతి అలంకారంలో స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంకాలం మహామంగళా రతులు అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు ప్రత్యేకంగా అలంకరింప చేయించి అలం కరణ పూజలు అనంతరం గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు. గ్రామోత్సవంలో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన కళాకారుల విన్యా సాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

వీరాచార్యుల విన్యాసాలు

ఉగాది మహెూత్సవంలో భాగంగా సోమవారం రాత్రి శివదీక్ష శిబిరాల వద్ద కన్నడ భక్తులచే అగ్నిగుండ ప్రవేశం వీరాచార్య సాంప్రదాయ పద్ధతిలో కర్ణాటకకు చెందిన వీరసేవభక్తులు వీరభద్ర ప్రవచనాలు పట్టిస్తూ ప్రత్యేక వేషధారణలో వివిధ వాయిద్యాల నడుమ ఒళ్ళు గగ్గుర్లు పొడిచే విన్యాసాలతో స్వామిభక్తి చాటుకున్నారు. ఈ విశేష కార్యక్రమాల్లో ఆలయ అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల సమర్థవంత నిర్వహణకు సూక్ష్మస్థాయి ప్రణాళిక

విశాలాంధ్ర-నంద్యాల:భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సార్వత్రిక ఎన్నికల సమర్థవంత నిర్వహణకు సూక్ష్మస్థాయి ప్రణాళికతో పక్కాఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల సంసిద్ధత, వడ గాల్పులపై జిల్లా కలెక్టర్ మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడానికి సూక్ష్మస్థాయి ప్రణాళికతో పక్కా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ, 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. నేటి వరకు రూ.4.9 కోట్ల విలువైన నగదు, లిక్కర్, ఇతర వస్తువుల సీజ్ చేస్తామన్నారు. సీజ్ చేసిన నగదును సంబంధిత వ్యక్తులు సరైన ఆధారాలతో వస్తే డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ ద్వారా తిరిగి చెల్లింపులు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. కలెక్టరేట్ లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్, ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా రాజకీయ ప్రచారాలకు సంబంధించి అనుమతి కోసం ఇప్పటివరకు 529 దరఖాస్తులు అందగా 433 అనుమతులు మంజూరు చేయగా, 49 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. 28 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. అనుమతులన్నింటినీ 24 గంటల లోపే మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. కోడ్ ఉల్లంఘన లో భాగంగా 22 మంది వాలంటీర్ల తొలగింపు ,ఒక అంశంలో కేసు నమోదు,ఓ ఒప్పంద ఉద్యోగి, రెగ్యులర్ టీచర్‌ను సస్పెండ్, 47 మంది రెగ్యులర్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఓడీలర్, ఎండీయూ ఆపరేటర్‌ను తొలగించామన్నారు. పార్టీ అనుచరులకు సంబంధించి టీడీపీకి -10మందిని, వైసీపీ-15 మందిని ఇతరులకు చెందిన 8 మందిని మొత్తం 33 మంది అనుచరులపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కోసం ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే స్టాటికల్ సర్వే లైన్ టీంలు నియోజకవర్గానికి మూడు చొప్పున మూడు షిఫ్ట్ లలో పని చేస్తాయన్నారు. పోలింగ్ విధులకు సంబంధించి అధికారులను పూర్తిస్థాయి ప్రక్షాళన చేపట్టి మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసుకున్నామని, వీరందరికి ఈనెల 15, 16 తేదీల్లో క్లాస్ రూమ్ తరహాలో పూర్తిస్థాయిని శిక్షణ నివ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈనెల 12, 13వ తేదీల్లో ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామన్నారు. అత్యవసర సర్వీసులకు సంబంధించి వివిధ విభాగాల్లో విధుల్లో ఉంటూ పోలింగ్ రోజు ఓటు వేయలేని 33 శాఖలకు చెందిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కూడా అర్హులైన ఆయా విభాగాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాకి సంబంధించి కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు దాదాపు 12 వేల మంది పెరిగినట్లు కలెక్టర్ తెలిపారు.

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండండి

నంద్యాల జిల్లాలో రోజురోజుకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధి కూలీలు ఎండ తీవ్రత పట్ల జాగ్రత్తగా ఉండేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టామని కలెక్టర్ వివరించారు. పట్టణాలలోని ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు అత్యవసరమైన ప్రదేశాలలో వైద్య శిబిరాల ఏర్పాటు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే బీసీలకు రాజ్యాధికారం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల పరిధిలోని బిజినవేములలో సోమవారం జయహెూ బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం టీడీపీ మండల నాయకుడు ఆమడాల మద్దిలేటి, టీడీపీ గ్రామ కార్యదర్శి ఉశేనయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బీసీ సోదరులందరికీ న్యాయం జరగాలన్న వారి కుటుంబాలు జీవితాలు బాగుపడాలన్నా తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వచ్చి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అందరి జీవితాలు బాగుపడతాయని టిడిపి ఉషెనయ్య అన్నారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ నాయకుడు అమ్మడాల మదిలేటి మాట్లాడుతూ జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా ఉండి బనగానపల్లె నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని వారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు రాష్ట్రం అన్ని విధాల బాగుపడాలన్న అప్పులు తీరాలన్న యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్న నిరుద్యోగ సమస్య తీరాలంటే పరిశ్రమలు రావాలని వారన్నారు అభివృద్ధి జరగాలన్న రాష్ట్రం బాగుపడాలన్న చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమన్నారు

గిరినాథ్ సెంటర్‌లో ఫిరోజ్ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాల టౌన్ 15వ వార్డు గిరినాథ్ సెంటర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించడం జరిగిందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. వార్డు నాయకులు వేణుగోపాల్, ఎబినేజర్, నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉన్న సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలు తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజల ఆర్థిక వ్యవస్థపై దెబ్బ కొట్టిందని, నిత్యవసర సరుకులు ధరలు పెరిగిపోవడంతో ప్రజల జీవన విధానం గడవడమే కష్టమైందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా అన్ని వర్గాల వారిని ఆర్థికంగా సామాజికంగా దెబ్బతీసిన ప్రభుత్వంగా వైసీపీ మిగిలిపోతుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలు ప్రజల్లోకి తీసుకెళదాం

విశాలాంధ్ర - నంద్యాల : కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న 9 గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళతామని నంద్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపవరం గోకుల్ కృష్ణరెడ్డి పేర్కొన్నారు. నంద్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపవరం గోకుల్ కృష్ణరెడ్డి డీసీసీ అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా, లేకపోయినా కాంగ్రెస్ పార్టీ వెన్నంటే ఉన్న కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నియోజకవర్గ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఖచ్చితంగా నిలబెట్టుకుంటానని, నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను కలుపుకొని పోయి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

జనసేనని బలపరుద్దాం - కూటమి అభ్యర్థులను గెలిపిద్దాం

విశాలాంధ్ర-పాములపాడు : వాడాలలోని ఎస్సీ,మైనార్టీ కాలనీలలో **'జనసేనని బలపరుద్దాం కూటమి'** అభ్యర్థులను గెలిపిద్దాం ఇంటింటి ప్రచార కార్యక్రమం సోమవారం మండల కన్వీనర్ రాముఆధ్వర్యంలో నిర్వహించారు.ఈసందర్భంగా రాము మాట్లాడుతూ వైసీపీ హయాంలో దళితులు, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రశ్నిస్తే వైసీపీ నాయకులు దళితులు మైనార్టీలపై దాడులు చేస్తూ, కేసులు బనాయించడం బాధాకరమన్నారు. ఎస్సీ బీసీ ,మైనార్టీ కార్పొరేషన్ల నిధులు లేకుండా పక్కదారి మళ్ళించి అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేషన్లను బలోపేతం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అభివృద్ధి చేసేది ఉమ్మడి ప్రభుత్వమేనన్నారు. ఎంపిగా బైరెడ్డి శబరిని, అసెంబ్లీ అభ్యర్థి గిత్త.జయసూర్యల సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

పబ్లికేషన్

నంద్యాల జిల్లా, నందికొట్కూరు మండలము, కొణిదెల గ్రామంలో వెలసిన శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించిన ఆస్తులు దేవదాయశాఖకు రిజిష్టర్ చేయుటకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల, ఈ వార్త ప్రచురణ అయిన తరువాత 15 రోజులలోపు మీ అభ్యంతరాలను జిల్లా దేవదాయశాఖ అధికారి, నంద్యాల వారికి వ్రాత పూర్వకంగా తెలుపవలసినదిగా కోరడమైనది.

ఎ.డి. వెంకట రమణ,
మండల ఇంచార్జీ, దేవాలయములు,
నందికొట్కూరు మండలం,నంద్యాల జిల్లా.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

విశాలాంధ్ర- నంద్యాల రూరల్ : క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగను ప్రతిఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి ఏడాది చైత్రశుద్ధ ప్రాద్యమి నాడు ఉగాది పండుగ నిర్వహించుకుంటామన్నారు. ఉగాది రోజు బ్రహ్మ సృష్టిని నిర్మించాడని అలాగే శ్రీ విష్ణుమూర్తి మత్స్య అవతారం ధరించి సోమకుణ్ణి సంహరించి వేదాలను సంరక్షించాడని, ఆ వేదాలు బ్రహ్మకు అప్పగించిన సందర్భంగానే ఉగాది పండుగ ఉద్భవించిందని పురాణాలు చెబుతున్నాయన్నారు. నేపథ్యంలో ఈ పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని వారు ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనాలను కలిగి ఉన్న ఉగాది పచ్చడి జీవితంలో కలిగే అన్ని అనుభవాలను సూచిస్తుందని పేర్కొంటూ జిల్లా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుల అరెస్టు-చోరీసోత్తు రికవరీ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల మండలం రైతునగరం గ్రామం, భగత్ సింగ్ కాలనీలో గతనెల మార్చిలో జరిగిన ఇంటి దొంగతనం కేసును నంద్యాలతాలూకా పోలీసులు ఛేదించారు. ఈ మేరకు సోమవారం నంద్యాల డీఎస్పీ రవింద్రనాథ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల ఆటో నగర్ సమీపంలో గల పోలూరు క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్‌కు చెందిన సుధాకర్, తిరుపతికి చెందిన గణేశ్ బ్రహ్మదేవిలను అరెస్ట్‌చేసి వారి వద్ద నుండి 20 లీటర్ల సారా,7 తులాల బంగారు కంకణాలు, 4 జతల బంగారు కమ్మలు, సాదా బంగారు గొలుసు, 4 చేతి వుంగరములు, బంగారు చంప చారలు, బంగారు నల్లపూసల దండ,చిన్న బంగారు గొలుసు స్వాదినం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తాలూకా సీఐ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శిల్పా సమక్షంలో వైసీపీలోకి

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు గన్నీవీధికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు 8వ వార్డు గన్ని టీం ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిల్పామోహన్ రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు.సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవ రత్నాలు, వాలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు,ఎమ్మెల్యే శిల్పా రవి, మాజీమంత్రి శిల్పా మోహన్‌రెడ్డి నంద్యాలలో పేద ప్రజలకు శిల్పాసేవాసమితి ద్వారా ఎన్నో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. మావంటి పేద కుటుంబాలు ఎంతో లబ్ధి పొందుతున్నామని నేడు శిల్పారవి కోసం మావంతు సహాయ సహకారం అందిస్తామని ఆయన గెలుపు కోసం కష్టపడతామని తెలియజేస్తున్నామన్నారు.అల్లిసాహెబ్, సుకూర్, గఫూర్, రబ్బాని, జాఫర్, మక్బూల్, ఫయాజ్, సైన్‌సా, నాయబ్, మహబూబ్ బాషా వారి కుటుంబ సభ్యులు వైసీపీలో చేరారు.

అభివృద్ధి చేశాం ఆదరించండి-గంగుల అవంతికారెడ్డి

విశాలాంధ్ర -చాగలమర్రి: ఆళ్ళగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, మరో మారు ఆదరించి గంగుల బిజేంద్రారెడ్డిని తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించాలమని ఆయన సోదరి గంగుల అవంతికారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని పెద్దవంగలిలో దస్తగిరిస్వామి దర్గా , సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తన సోదరుడిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.సర్పంచు బంగారు షరీఫ్, జడ్పిటీసి లక్ష్మిదేవి,ఎంపీటీసీ లక్ష్మిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి రమణ,జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీని వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పండుగా శుభాకాంక్షలు -మాజీ సర్పంచు బీసీ రాజారెడ్డి

విశాలాంధ్ర- బనగానపల్లె: నియోజకవర్గ ప్రజలకు బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచు బీసీ రాజారెడ్డి,ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.తెలుగువారు ఉగాది పండుగను కొత్త సంవత్సరం ప్రారంభ సూచికగా భావిస్తారని ఈ నూతన సంవత్సరంలో ప్రారంభించే ప్రతి పనులకు శుభం కలగాలని మనసార భగవంతుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రామికులు, రైతులకు, ఉద్యోగస్తులకు, అన్ని వర్గాల వారికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర- రుద్రవరం: రోజురోజుకు పెరుగుతున్న వేసవి ని దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని బైరి శ్రీహరి, బ్రహ్మాంలు పేర్కొన్నారు.సోమవారం మండలకేంద్రానికి చెందిన బైరి వెంకటమ్మ, చిన్నపుల్లన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అమ్మ వారిశాల నాలుగు రోడ్ల కూడలి, పెద్దమ్మ బయలు, పంచాయతీ కార్యాలయ సమీపంలో, ఉన్నత పాఠశాల ప్రాంతంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా గ్రామానికి చెందిన కొల్లం పుల్లయ్య, తెలుగు బాబు, లింగం బ్రహ్మయ్య, దేవగుడి రెహమాన్, నూకల కృష్ణమూర్తిలు చలివేంద్రాలు ప్రారంభించారు. నాలుగేళ్లుగా తమ తల్లిదండ్రుల పేరు మీద మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి గ్రామంలో పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. మబ్బు బాలస్వామి, మందలూరు శ్రీనివాసరెడ్డి, దేగల చెన్నయ్య, లొడుగు నరసింహులు, లాజర్, సామేలు, రాజేష్, వడ్డే చంటన్న శౌరి, తువ్వపల్లి భాష పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర - కర్నూలు: ఎస్టీయూ భవనం నందు ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వ ర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎస్ గోకారి అధ్యక్షతన ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగి నది. ఈ కార్య క్రమానికి సమగ్ర శిక్ష అభి యాన్ అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయ కుమారి జ్యోతి ఏడి శ్యామల్ పాల్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్ తిమ్మన్నలు హాజరైనారు. వారు మాట్లాడుతూ చంద్ర మానాన్ని అనుసరించే ఇస్లామియా క్యాలెండర్ 9వ నెల రమదాన్‌నే రంజాన్ అన్నారు. సమస్త మానవాళికి మార్గ నిర్దేశంగా పవిత్ర ఖురాన్ గ్రంథము రంజాన్ మాసంలోనే వతరించి నందుకు కృతజ్ఞత తో ముస్లింలు నెల రోజులు విధిగా ఉపవాసాలు దాన ధర్మాలు చేస్తారన్నారు. పండగలు మన జీవన ప్రవంతిలో భాగమై మన జాతీ యతకు, సంస్కృతి వికాసానికి దోహదం చేస్తాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పీకే జనార్దన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మహమ్మద్ షఫీ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ ముదాసీర్ అహ్మద్, గోవిందు, గోవింద్ నాయక్ సురేష్,మూర్తుజా వలి, ఉస్మాన్, అబ్దుల్ రహీం, మోహి యుద్దీన్, ఖాజా మొహిద్దిన్, దేవదాస్, సుంకన్న, ముస్లిం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర -కర్నూలు సిటీ : హెూటల్, బేకరీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్ఎస్ రోడ్డు సర్కిల్లో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి చంద్రశేఖర్, హెూటల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అధ్యక్షులు పురుషోత్తం, కార్యదర్శి టి. రామాంజనేయులు, ఆనందు, నరసింహ, రంగనాయకులు, అబ్దుల్ వహాబ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ ఈ వేసవికాలంలో రోజుకి 40 నుండి 45 డిగ్రీల ఎండలు ఉండడం వలన గ్రామీణ ప్రాంతాల ప్రజలతోపాటు నగరంలో ఆయా పనుల కోసం వచ్చే కార్మికులు ఆర్ఎస్ రోడ్డు అడ్డాకు వస్తుంటారని చెప్పారు. పని చేసుకోవడానికి వచ్చిన కార్మికులకు తాగునీరు లేక వడదెబ్బ కొట్టే ప్రమాదం ఉందని, తక్షణమే నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్, కార్మిక శాఖ అధికారులు నగర ప్రధాన కూడలిలో కార్మికులను ప్రజలను దృష్టిలో పెట్టుకొని చలి వేంద్రాలు, మజ్జిగ, కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. హెూటల్ బేకరీ కార్మికులు తమ సొంత ఖర్చులతో దాతల ద్వారా గత 3 ఏళ్లుగా చలివేంద్రలు ఏర్పాటు చేసి కార్మికుల దాహం తీరుస్తున్నందుకు హెూటల్, బేకరీ కార్మికులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని వారికి మునెప్ప సూచించారు. లక్ష్మన్న, నాగరాజు, రజిని, రఘు, రాము, శ్రీనయ్య, మునిస్వామి, పాల్గొన్నారు.

బోనాల పండుగకు ముస్తాబైన వడ్డగేరి సుంకులమ్మ

విశాలాంధ్ర - వెల్దుర్తి : ఉగాది సందర్భంగా వెల్దుర్తి లోని వడ్డగేరిలో వెలిసిన సుంకులమ్మ అమ్మవారు బోనాల పండుగకు ముస్తా బయింది. ఈ పండుగకు ప్రత్యేకంగా అమ్మవారికి పూజలు చేసి వడ్డెర కులస్తులందరూ కలిసి బోనాలను సమర్పిస్తారు. పండుగ రోజు ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారికి ప్రత్యేకంగా ఇళ్ల నుండి తీసుకొచ్చిన ప్రసాదాలను అందిస్తారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు పల్లకిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పెట్టుకొని గ్రామంలో ఊరేగిస్తారు. పండుగ మరుసటి దినం సుంకులమ్మ అమ్మ వారితో పాటు మారమ్మ తల్లికి బోనాలను వడ్డెర కులస్తులంతా కలిపి ఊరేగింపుగా వెళ్లి అందిస్తారు. ఈ విధంగా రెండు రోజులపాటు అమ్మవారి ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఉత్సవాల్లో వెల్దుర్తి పట్టణ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు వచ్చి పాల్గొంటారు.

అక్రమ ఐరన్ వార్ సంపద తవ్విన వారిపై చర్యలు తప్పవు

విశాలాంధ్ర - కర్నూలు జిల్లా పరిషత్ : వెల్దుర్తి మండలం లోని బాలాపురం రేపల్లె మధ్య అక్రమ ఐరన్ వార్ తవ్వకాలు జరుపుతు న్నట్లు సోమవారం సమాచారం వచ్చిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ జి.రాజశేఖర్ అన్నారు. పోలీస్ సిబ్బంది విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ రెవెన్యూ వారు తనిఖీలు చేపట్టడం జరిగింది. ఈ తనిఖీలో సర్వే నంబర్ 51 బార్ 48 సర్ప రాజపురం విలేజి క్రిందికి వస్తుందని, తవ్వకాలు చేపట్టి ఇక్కడ స్టాక్ పెడుతున్నారని తెలిసింది. దీనిపై సమగ్రహా విచారణ చేపట్టి వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కల్లు విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-ఆదోని టౌన్‌ కౌతాళ మండల పరిధిలోని కల్లు విక్రేతదారులపై చర్యలు తీసుకోవాలని సోమవారం కర్నూలు అబ్కారి సీఐకు ఫిర్యాదు చేసినట్లు లింగప్ప విలేకరులకు తెలిపారు. లింగప్ప మాట్లాడుతూ గత కొద్ది రోజుల నుండి కల్తీ కల్లుకు బానిసై, చాలా మంది అనారోగ్యాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌతాళ మండల పరిధిలో ఈత వనంలో చెట్లు కాలిపోయి ఉన్నాయని, కల్లు విక్రేతదారులు కృత్రిమంగా కల్లు తయారు చేసి అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారన్నారు. తక్షణమే అధికారులు కల్తీకల్లు విక్రేత దారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

నిండిన డ్రైనేజీలు.. పట్టించుకోని అధికారులు

విశాలాంధ్రు-హెూళగుంద : మండలంలోని సులువాయిలో డ్రైనేజీలో చెత్తాచెదారం నిండిపోవడంతో మురుగునీరు ప్రవహించక దుర్గంధంగా మారిందని ప్రజలు ఆరోపించారు. డ్రైనేజీలో నిండిపోయిన చెత్తాచెదారాన్ని ఎత్తివేస్తే మురికి నీరు సులభంగా ప్రవహిస్తాయని, ఎలాంటి దుర్వాసన వెదజల్లదని ప్రజలు అన్నారు. డ్రైనేజీలు నిండిపోవడంతో మురికి నీరు నిల్వ ఉండడం వల్ల దోమలకు ఆవాసంగా మారిందని వారు ఆరోపించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో డ్రైనేజీలలో నిండిన చెత్తాచెదారాన్ని పారిశుద్ధాన్ని అధికారులు తొలగించక పోవడంతో తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ప్రజలు వాపోయారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి డ్రైనేజీలలో నిండిన పారిశుధ్యాన్ని ఎత్తివేసి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

విధులకు రాజీనామా చేసిన వలంటరీలు

విశాలాంధ్ర -కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరు గ్రామా నికి చెందిన వలంటరీలు స్వచ్ఛ ందంగా విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు సోమ వారం కల్లూరు ఎంపీడీవో కార్యాల యంకు దొడ్డిపాడు, పెద్దటేకూరు గ్రామాలకు చెందిన 20 మంది వలంటరీలు చేరుకునిరాజీనామా పత్రంపై సంతకాలు చేసి, సీనియర్ అసిస్టెంట్ పరమేష్ రెడ్డికి అందజేశారు. వైసీపీ యువ నాయకులు హనుమంత్ రెడ్డి, అబ్దుల్ సుకుర్ బాష, మన్సూర్ అలీ, వలంటీర్లు ఖలీల్, సమీర్, నబి రసూల్, ముని, రామలక్ష్మమ్మ పాల్గొన్నారు.

జి.పుల్లయ్య ఎంబీఏ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్‌ స్థానిక వెంక య్యపల్లిలోని జీ.పులయ్య ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు కేవీ సుబ్బారెడ్డి స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ వారు నిర్వహించిన నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్ ఉన్నతి- 2024లో ప్రతిభ కనపరిచారు. రెండు రోజులు నిర్వహించిన నేషనల్ లెవెల్ మేనేజ్మెంట్ మీట్ పోటీలలో జి.పుల్లయ్య ఎంబీఏ విద్యార్థులు హెచ్ఆర్ యాక్టివిటీలో మొదటి బహుమతి జి.శ్రావణి, కె.ప్రీతి, ఎం.పల్లవిలు అందుకున్నారు. ఫైనాన్స్ యాక్టివిటీలో రెండవ బహుమతి ఎండి.బుష్రా, మహీన్ చాందిని బేగం బహుమతిని అందుకున్నారు. మిస్ ఉన్నతి మొదటి బహుమతి టి. ఈశ గెలుచుకున్నారు. ఇందులో భాగంగా కాలేజ్ నిర్వహించిన అభినందన సభలో డాక్టర్ సి.శ్రీనివాసరావు ప్రిన్సిపల్ విద్యార్థులను అభినందించారు. ఇంకా గొప్ప స్థాయికి ఎదగాలని మరిన్ని పోటీలలో విద్యార్థులను పాల్గొనాలని వాళ్లకు కితాబ్ ఇచ్చారు. డీన్ అడ్మిన్ డాక్టర్ ఎం.గిరిధర్ కుమార్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ శశి కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగుల పాలాభిషేకం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : దివ్యాంగులకు టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.6 వేల పింఛన్ ఇస్తామని ప్రకటించడంతో సోమవారం మండల కేంద్రమ్మైన పెద్దకడబూరులోని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి స్వగృహం నందు దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీడిపి రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి మాట్లాడుతూ జగన్ హయాంలో దివ్యాంగులకు ఒక్క రూపాయి పెంచకపోవడం దారుణమని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో దివ్యాంగులు చంద్రబాబును బలపరచాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏసేపు, మీసేవ ఆంజనేయ, అంజి, బాబు, ఆశన్న, దివ్యాంగుల మండల అధ్యక్షులు రాఘవ రెడ్డి, మండలంలోని దివ్యాంగులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై ప్రేమ జంట ఆత్మహత్య

విశాలాంధ్ర -మంత్రాలయం: మంత్రాలయంలోని తుంగభద్ర రైల్వే స్టేషన్‌లో సోమవారం తెల్లారి జామున రైల్వే ట్రాక్‌పై ప్రేమ జంట మృతదేహాలు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సమాచారం మేరకు.. మంత్రాలయం నియోజకవర్గంలోని రచ్చుమారి గ్రామానికి చెందిన చాకలి గోవిందు కుమారుడు చాకలి వెంకటేష్ (20) మంత్రాలయం పట్టణానికి చెందిన బోయ అంజి కుమార్తె నందిని (19) గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమించు కుంటున్నామని పెద్దలకు చెప్పినా నిరాకరించడంతో, మన స్థాపానికి గురై రైల్వే పట్టాలపై పడుకొని చనిపోయినట్లు తెలిపారు. మృత దేహాలను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం పోలీసులు తెలిపారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహిం చడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కర్నూలు జిల్లా లోని పలు ప్రాంతాలలో పోలీసులు కవాతు నిర్వహించారని కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్ ఐపియస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా, శాంతిభద్రతలను కాపా డడానికి కేంద్ర సాయుధ బలగాల పోలీసులతో కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు

విశాలాంధ్ర -హెూళగుంద : మండలంలోని నేరనికి దేవర గట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయం సోమవారం అమా వాస్య సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది స్వామివారిని కర్నూల్ పార్లమెంటరీ టీడీపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజ్, ఆలూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బి వీరభద్ర గౌడలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవరగట్టులో గురవయ్యల సందడి ఎక్కువ కనిపించింది. భక్తులు గోరవయ్యోలకు కానుకలు మొక్కుబడులు చెల్లించి పూజలు చేశారు. భక్తులకు గోరవయ్యలు తలకు పసుపు బండారాన్ని పూసి ఆశీర్వదించారు. స్వామివారికి పూజారులు గిరి మల్లయ్య స్వామి, మహేస్వామీలు రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, మంగళహారతితో పూజించారు ఆస్పరి స్వామి మఠంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు భజన కార్యక్రమాలు జరిగాయి.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న బళ్లారి మాజీ మేయర్ శశికళ కృష్ణమోహన్ దంపతులు



విశాలాంధ్ర - తుగ్గలి: మండల కేంద్రంలో వెలసిన కొలిచే వారికి కొంగుబంగారమై భక్తుల కోర్కెలు తీర్చే ఆరోగ్య ప్రదాత సంతాన వరుదుడైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని బళ్లారి మాజీ మేయర్ శశికళ కృష్ణమోహన్ దంపతులు ఆలూరు టిడిపి సీనియర్ నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. అమావాస్య సందర్భముగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు అర్చనలు విశేష పూజలు అన్నదాన కార్యక్రమం ఆలయ నిర్వాహకులు ఎస్ విజయ ప్రసాద్ యాదవ్ నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధికంగా తరలివచ్చి సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామిని దర్శించుకొని పూజారిచే ఆశీర్వాదాలు తీసుకొన్నారు

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు సహకరించాలని వెల్దుర్తి సీఐ సురేష్ కుమార్ రెడ్డి కోరారు. సోమవారం క్రిష్ణగిరి ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండలంలోని లక్కసాగరం, పందిర్ల పల్లె, సంగాల, అమకతాడు, పుట్లూరు గ్రామాల్లో ఆర్మీ పోలీస్ బలగాలతో గ్రామాల పుర వీదుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల ప్రజలు తమ ఓటును స్వేచ్ఛ గా సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి గొడవలు పెట్టుకోకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. అల జడులు సృష్టించిన వారిపై చట్టపైనమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ కోడుఉల్లంఘన చేయ రాదని ఆయన అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, సొంత నిర్ణ యాలు ఎవరు తీసుకోకూడదని ఆయన తెలిపారు. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలపై పోలీస్ ప్రత్యేక నిఘ ఉంచినట్లు ఆయన తెలిపారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఆర్మీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యానికి ఏ లోటు రాకుండా చూస్తా..

విశాలాంధ్ర - సి.బెళగల్ : కోడుమూరు నియోజకవర్గంలో వైద్యం విషయంలో ప్రజలకు ఎటువంటి లోటురాకుండా చూస్తానని కోడుమూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం సి.బెళగల్ మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి కి మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అనారోగ్యానికి గురై కర్నూల్ లోని అమీలియా హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సతీష్ ఆసుపత్రికి వెళ్లి తిమ్మారెడ్డిని పరామర్శించి హాస్పిటల్లో డాక్టర్లతో మాట్లాడి తిమ్మారెడ్డికి మెరుగైన వైద్యం అందేలా చూడా లని వారు డాక్టర్లను కోరారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి తిమ్మారెడ్డికి ఏమీ కాదని మీరు ధైర్యంగా ఉండాలని వారు వారి కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు.

ఓటు హక్కు రాజ్యాంగం మనకిచ్చిన ఆయుధం

విశాలాంధ్ర -కర్నూలు సిటీ: ఓటు హక్కు రాజ్యాంగం మనకిచ్చిన ఆయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ తేజ కోరారు. ఓటర్ల అవగాహనా కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరపాలక చెత్త సేకరణ వాహనాలతో విన్నూత్నంగా ర్యాలీ నిర్వహించారు. నగర పౌరులకు ఓటు హక్కు వినియోగం పట్ల అవగాహన కల్పించడం కోసం రిటర్నింగ్ అధికారి ఏ. భార్గవ తేజ, అదనపు కమిషనర్ పి వి రామలింగేశ్వర్, హెల్త్ ఆఫీసర్ కె విశేశ్వర్ రెడ్డి తదితరులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞతో మొదలైన ఈ ర్యాలీ, ఓటర్‌లను జాగృత పరుస్తూ కళాజాత బృందం నినాదాల గానాలతో, మహావీర్ సర్కిల్, పాత కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, జిల్లా పరిషద్, రాజ్ విహార్, గౌరిగోపాల్, మెడికల్ కాలేజీ, గవర్నమెంట్ హాస్పిటల్, గాయత్రీ ఎస్టేట్, సి క్యాంపు మీదుగా నంద్యాల చెక్ పోస్ట్ వరకు సాగింది. కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ నాగరాజు, ఎ ఈ దినేష్, సోషల్ డెవలప్మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ పెంచలయ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ నుంచి వైసీపీలో చేరిక

విశాలాంధ్ర - చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గంలోని హెూలగుంద హాలహర్వి మండలాల నుండి టీడీపీ, బీజేపీ కార్యకర్తలు ఆలూరు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి వీరపాక్షి ఆధ్వర్యంలో వైసీపీ లో చేరారు. సోమవారం మండల కేంద్రమైన చిప్పగిరి ఆలూరు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి బుసినే విరుపాక్షి స్వగృహం నందు హెూలగుంద, హాలహర్వి మండలాలకు చెందిన దాదాపు 70 కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఆలూరు నియోజకవర్గం విరుపాక్షి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిం చిన సంక్షేమ పథకాలు వల్లనే పార్టీలోకి వలసల బాట పట్టారన్నారు. అనం తరం హెూలగుంద మండల పరిధిలోని కోగిల తోట, హాలహర్వి మండల పరిధి లోని గూల్యం గ్రామాలకు చెందిన టీడీపీ, బీజేపీ కార్య కర్తలు, గుల్యం జిల్లా పరిషత్ విద్య కమిటీ చైర్మన్ లింగప్ప, బాపూరం సోమప్ప, మంజు మల్లప్ప సోమలింగ వెంకటేష్ రమేష్ సోమిరెడ్డి, తిమ్మప్ప మల్లికార్జు రెడ్డి, హనుమంతు, దేవన్న, మల్లేష్, కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆలూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం : పంచలింగాల నాగరాజు

విశాలాంధ్ర - హెూళగుంద : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆలూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని కర్నూలు పార్లమెంటరీ టిడిపి పార్టీ అభ్యర్థి పంచలింగాల నాగరాజు స్పష్టం చేశారు. దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామికి కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజ్, ఆలూరు అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బి వీరభద్ర గౌడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవరగట్టులో ఉన్న ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో కర్నూల్ పార్లమెంట్ టిడిపి అభ్యర్థి పంచలింగాల నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఆలూరు నియోజకవర్గం పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గం రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం బిసి వర్గానికి చెందిన వాడైనందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిధులు ఇవ్వకుండా అనగదొక్కాడని విమర్శించారు. జగన్ బీసీలను రాజకీయంగా ఎదగకుండా అణగదొక్క కుండపనిగా పెట్టుకున్నాడని వాపోయారు. డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్ర రెడ్డి మంత్రిగా ఉంటే కోట్లాది రూపాయల నిధులను జగన్ విడుదల చేసి అభివృద్ధి చేశాడని, అదే ఆలూరు ప్రాంతానికి బీసీ మంత్రి అయినందుకు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశాడని అన్నారు. డోన్‌లో కొండలను గుట్టలను వదలకుండా రోడ్డు వేశారని అన్నారు. వీరభద్ర గౌడ్ టిడిపి కండువాను చిన్న పూజారి దేవనకు వేసి పార్టీలోకి సాదరంగ ఆహ్వానించారు. సమావేశంలో టిడిపి యువ నాయకుడు గిరి మల్లేష్ గౌడ్, మండల టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, టిడిపి నాయకులు తోక వెంకటేష్ కురువ జయరాం, కురువ శేషప్ప, ఎండీ ఆదం, రాంపురం బషీర్, కాకి సీతయ్య, బిజెపి నాయ కుడు వెంకటరాముడు జనసేన నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి..

విశాలాంధ్రు-హెూళగుంద: మండలంలోని దేవరగట్టు ఎదురు బస్సు ఉన్న గుడి ముందు రెండు నీటి తొట్టిలను ఏర్పాటు చేసి మంచినీటి ట్యాంకు ద్వారా మంచినీటిని సరఫరా చేశారని, మంచినీటితొట్టీలకు పైప్‌లైన్ తొలగించడంతో నీరు లేక మంచినీటితో వెలవల బోతున్నాయని ప్రజలు తెలిపారు. నీటితొట్టిలు అలంకాం ప్రాయంగా మిగిలాయని ఎండలు విపరీతంగా ఉండడం తో మంచినీటి కోసం భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మంచినీటి తొట్టికి మంచినీటి సరఫరా చేస్తే అందరికీ మంచినీరు లభిస్తాయని, అధికారుల నిర్లక్ష్యం వల్ల మంచి నీటితొట్టికి నీరు సరఫరా కాక ఆస్పరి స్వామి మఠానికి వెళ్లి మంచి నీటిని ఎత్తుకు వస్తున్నామని భక్తులు పేర్కొన్నారు. మసీదు ముందు వేసిన మంచినీటి బోరు చెడిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు మరమ్మతు చేయలేదని ప్రజలు వాపోయారు. కనీసం చేయి బోరు పనిచేసిన మంచినీటి సమస్య తీరేదని అన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ సో మేరువన్నమ్మ మాట్లాడుతూ భూగర్భ జలం అడుగంటి పోవడంతో నీటి సమస్య ఏర్పడిందని, అందువల్ల మంచినీటి తొట్టిలకు నీటిని సరఫరా చేయలేదని అన్నారు. మంచినీటి బోరుకు విద్యుత్ మోటర్ బిగించి మంచినీటి సరఫరా చేస్తామని అన్నారు. చెయ్యి బోరు చెడిపోయిందని వెంటనే మరమ్మతకు చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది పడకుండా పగలు రాత్రి కష్టపడి మంచినీరు అందిస్తున్నామని స్పష్టం చేశారు

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం..

విశాలాంధ్ర -వెల్దుర్తి : సంక్షేమ పాలన కొనసా గాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి కంగాటి శ్రీదేవి మండల పరిధిలోని బోగోలు, గువ్వలకుంట్ల, గ్రామంలోసోమవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా గ్రామానికి వచ్చినవారికి స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి ఐదేళ్ల పాలనలో పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించారన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పింఛన్ మంజూరుకు, ఇళ్ల స్థలాలకు ఇంత అని నిర్దేశించి పేదలనుంచి డబ్బులు దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కేవలం అర్హత ఆధారంగా పథకాలు అంజేస్తున్నారని, జగనన్న పాలనలో జనం సంతోషంగా ఉన్నారని, ఆ సంతోషాన్ని కొనసాగించుకోవాలంటే మళ్లీ వైసీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు రామ్మోహన్ రెడ్డి, మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాటసారా స్థావరాలపై దాడి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలంలోని దిబ్బనకల్ గ్రామ పరిసరాలలో వలమప్ప కొండ వద్ద నాటు సారా తయారీ చేస్తున్న స్థావరాలపై ఇస్వి పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసులు,పెద్ద తుంబలం ఎస్సై చిన్న పీరయ్య, తాలూకా ఎస్సై ఎర్రి స్వామిలు సిబ్బందితో కలిసి రాబడిన సమాచారం మేరకు సోమవారం దాడులు నిర్వహించి, అక్రమ నాటసారను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన అక్రమ నాటు సారాను సీఐ నిరంజన్ రెడ్డి సమక్షంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 150 లీటర్ల నాటు సారా, ఆటోను స్వాధీన పరచుకుని 1000 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాలలో అక్రమ కర్ణాటక మద్యం, నాటు సారా అమ్ము కాలు జరిపినట్లు తెలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఎన్నికల దృష్ట్యా ఎవరైనా అసాంఘిక కార్యకల్పాలకు పాల్పడితే చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ముఖ్యంగా యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు.